సాక్షి
జనగామ

శనివారం । 10 । ఆగస్టు । 2024



'పాలంబాట'తో సత్ఫలితాలు

రైతుల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న పాలంబాట కార్యక్రమం సత్ఫలితాలిస్తోందని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



ఆదివాసీ పరిశోధనలపై దృష్టి పెట్టాలి

విద్యార్థులు ఆదివాసీ పరిశోధనలపై దృష్టి సారించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి శ్రావణ శుక్రవారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం ఈఓ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యాన అర్చకులు స్వామి వారిని పంచామృత చందన హరిద్ర కుంకుమాద్రి విలేపనములు, పలు రకాల పుష్పాలు, పండ్లతో అలంకరించారు.

సీపీని కలిసిన పోలీస్ అధికారులు



వరంగల్ క్రైం : జనగామ రూరల్ సర్కిల్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డి, చిల్పూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన నవీన్‌కుమార్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు.

న్యాయవాద దంపతులపై దాడిని ఖండిస్తున్నాం..

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ: జనగామ కోర్టు న్యాయవాద దంపతులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలు శుక్రవారం నాలుగోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయవాదులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, దాడికి పాల్పడిన పోలీసులను ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు లంచాలకు అలవాటుపడి ప్రజలను వేధిస్తున్నారని, ఎమ్మెల్యేగా ఉన్న తనపైనే 4 అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. న్యాయవాదుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోలీసుల దాడిలో గాయపడ్డ న్యాయవాద దంపతులను పరామర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



జనగామ: నీటిపారుదల శాఖ పరిధిలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్ పిలుపునిచ్చారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ శాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. డీఎస్ఈ పక్లంరాజు, ఈఈ మంగీలాల్, డీఈఈ రవి, ఏఈ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ

జనగామ రూరల్: చెట్లతోనే మానవ మనుగడ ముడిపడి ఉంది.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చౌడారంలోని కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామం పచ్చదనంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేసే విధానాన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. తాగు నీరు కలుషితం కాకుండా బ్లీచింగ్ చేయాలని, ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ రాము తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలకే పగుళ్లు..



చిల్పూరు వద్ద ఆకేరు వాగుపై రూ.80 లక్షల వ్యయంతో బ్రిడ్జి నిర్మించారు. పనులు పూర్తయిన రెండు నెలలకే వంతెన బీమ్‌కు పగుళ్లు వచ్చాయి. శుక్రవారం ఈ విషయాన్ని స్థానికులు గుర్తించారు. ప్రధాన బీమ్‌కు పగుళ్లు వచ్చిన నేపథ్యంలో వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తే పరిస్థితి ఏమిటని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పనుల నాణ్యత విషయమై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- చిల్పూరు

కూనూర్ నాగేంద్రస్వామి ఆలయంలో..



జనగామ : పోచమ్మ టెంపుల్‌లో నాగేంద్రుడికి పాలు పోస్తున్న భక్తులు



గీతాశ్రమంలోని శివాలయం వద్ద పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



శ్రీ సంతోషిమాత ఆలయంలో..



చల్లంగచూడు నాగన్నా..

శ్రావణ శుక్రవారం.. నాగుల పంచమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగదేవతలకు పూజలు చేసి పాలు పోశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే స్వగృహంలో వెండి, రాగి, రాతి చెక్కలతో తయారు చేసిన నాగ పడిగెలకు అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగచూడు నాగన్నా.. అంటూ వేడుకున్నారు.

- జనగామ

- మరిన్ని చిత్రాలు 9లో▸

స్కూళ్లకు ఉచిత కరెంట్..!

- ప్రభుత్వ పాఠశాలలకు తొలగనున్న విద్యుత్ సమస్య
- ఇక నిరంతరంగా డిజిటల్ తరగతులు
- జిల్లాలో 665 ప్రభుత్వ పాఠశాలలు
- పెండింగ్ బిల్లుల బకాయి రూ.1.32కోట్లు
- సర్కారుకు నివేదిక పంపిన అధికారులు



డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

జనగామ: సర్కారు స్కూళ్ల విద్యుత్ బిల్లుల బాధ్యత ప్రభుత్వం తీసుకోనుంది. రాష్ట్రంలో ఉచిత కరెంట్ పథకాన్ని అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం సర్కారు స్కూళ్లకు సైతం వర్తింప జేయనుంది. దీంతో డిజిటల్ బోధనకు కరెంట్ కష్టాలు తప్పనున్నాయి. నిరంతరాయంగా సాంకేతికతతో కూడిన విద్యా బోధన అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా విద్యాశాఖ నుంచి ప్రభుత్వం నివేదికలను సైతం కోరింది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత కేబినెట్ నిర్ణయం తీసుకుని.. ఉచిత విద్యుత్ అమలుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తారని తెలుస్తోంది.

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ పథకం అమలు చేసి.. ఆర్థిక భారాన్ని తగ్గించనుంది. పాఠశాలకు వచ్చే అరకొర జనరల్ ఫండ్‌తో నెట్టుకు వచ్చిన ప్రధానోపాధ్యాయులు.. విద్యుత్ బిల్లులు చెల్లించలేక పోతున్నారు. దీంతో ఎన్పీడీసీఎల్‌కు రూ.లక్షల్లో బకాయిలు పెరిగిపోయాయి. గతంలో తరుచూ సంస్థ అధికారులు హెచ్ఎంలకు నోటీసులు పంపించడం, ఒక్కోసారి విద్యుత్ సరఫరా నిలిపి వేసే పరిస్థితి ఉండేది. సర్కారు స్కూళ్లలో మెరుగైన విద్య అందించే క్రమంలో ఆర్థిక లావాదేవీలు, ఒత్తిడి ఉండకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం యూనిట్ల నిబంధన లేకుండా ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుట్టబోతున్నది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత, మోడల్, కేజీబీవీ, గురుకులాలు, హాస్టళ్లు కలిపి 665 వరకు ఉంటాయి. ఇందులో 125 పాఠశాలల్లో(6, 8వ తరగతి) డిజిటల్ తరగతులు(టీవీలు), 91 పాఠశాలల్లో కంప్యూటర్లు, ప్రాథమిక పాఠశాలల్లో 317 ట్యాబ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకుని పేద విద్యార్థులకు ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేస్తున్నారు.



బకాయిలు రూ.1.32కోట్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఇప్పటి వరకు 1,21,520 యూనిట్ల విద్యుత్ వినియోగానికి మొత్తం రూ.1.32కోట్ల మేర బిల్లు బకాయి ఉంది. ఇందులో జనగామ, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, పాలకుర్తి మండలాల పరిధి స్కూళ్లకు సంబంధించి అత్యధికంగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

విద్యుత్ వినియోగంపై నివేదిక

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించనున్న నేపథ్యంలో పాఠశాలల వారీగా ఎన్ని గదులు, పిల్లల సంఖ్య, అదనపు గదులు, టాయిలెట్లు, కరెంట్ లోడ్, కేటగిరి, సర్వీసు నంబర్, గత నెలలో వినియోగించిన యూనిట్లు, బకాయిలు తదితర వివరాలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. సర్కారు నిర్ణయంతో వేసవిలో విద్యార్థులకు ఉక్కపోత సమస్య, డిజిటల్ తరగతులు, ప్రాథమిక పాఠశాలల పరిధిలో నూతనంగా అందించిన ట్యాబ్‌లకు చార్జింగ్ ఇబ్బందులు తప్పనున్నాయి. అలాగే.. పచ్చదనం మరింత పెంచేందుకు నీటి అవసరాలకు దాతల సహాయంతో నూతనంగా బోర్లు వేయించి, మోటార్లు బిగించేందుకు పలువురు హెచ్ఎంలు ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టారు.

మండలాల వారీగా పాఠశాలలకు సంబంధించి విద్యుత్ కనెక్షన్లు, ఇప్పటి వరకు ఉన్న బకాయి వివరాలు(రూ.లక్షల్లో)

మండలం	సర్వీసులు	బకాయిలు
జనగామ	108	30.72
బచ్చన్నపేట	60	5.95
దేవరుప్పుల	51	7.34
లిం.ఘనపురం	44	4.60
రఘునాథపల్లి	70	15.28
నర్మెట	41	8.02
తరిగొప్పుల	31	6.20
స్టేషన్‌ఘన్‌పూర్	69	14.92
చిల్పూరు	36	3,79
జఫర్‌గఢ్	57	13.16
పాలకుర్తి	53	17.37
కొడకండ్ల	45	5.13
మొత్తం	665	1.32

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం..



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి పంపించాం. 550 స్కూళ్లతోపాటు కేజీబీవీ, మోడల్, హాస్టల్స్, గురుకులాల వివరాలను సర్కారు కోరిన విధంగా నివేదిక రూపంలో అందించాం. ప్రస్తుతం పాఠశాలలకు సంబంధించి విద్యుత్ బిల్లు బకాయిలు రూ.కోటికి పైనే పెండింగ్‌లో ఉన్నాయి. ఉచిత విద్యుత్ అమలు చేస్తే డిజిటల్ తరగతులు, మొక్కలకు నీరు, వేసవిలో విద్యార్థులకు ఫ్యాన్లు నడిపించుకునే వెసులుబాటు ఉంటుంది.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

'పంద్రాగస్టు'కు పటిష్ట ఏర్పాట్లు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్లు, డీసీపీ తదితరులు

- సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులు స్వచ్ఛత నెలకొనేలా గ్రౌండ్‌ను సిద్ధం చేయాలని, వేడుకలకు హాజరయ్యే వారికి కనీస వసతి సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని చెప్పారు. స్టేజీ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, దేశ భక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ప్రముఖులు, స్వాతంత్య్ర సమరయోధులను ఆహ్వానించాలని సూచించారు. ప్రతీ శాఖ నుంచి ముగ్గురు ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి నివేదిక పంపించాలని తెలిపారు. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉద్యోగులకు జిల్లా, మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ, పాత్రికేయులకు క్రీడలు నిర్వహిస్తామన్నారు. పంద్రాగస్టు రోజు కలెక్టరేట్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగే ఎట్‌హోం కార్యక్రమానికి ఉద్యోగులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. సమీక్షలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపు

జనగామ రూరల్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. రైతు రుణమాఫీలో పలు కారణాలతో చెల్లింపులు జరగని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ స్థాయి రైతులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బ్యాంక్, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ విషయమై మల్కాపూర్‌లో 3వేల మందికిపైగా రైతుల సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. అలాగే లింగాలఘణపురం మండల పరిధి ఎనిమిది గ్రామాల రైతులు కెనరా, యూనియన్ బ్యాంక్‌లలో ఏర్పడిన సమస్యలను దృష్టికి తీసుకురాగా.. సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆధార్ నంబర్‌తో సొసైటీల వద్ద తీసుకున్న రుణాలతో ఏర్పడిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మూడో విడత రుణమాఫీ అమలయ్యే వరకు సంబంధిత సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇవ్వడానికి అధికారులు అనువైన స్థలాలను గుర్తించాలని, నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భవనాలకు స్థలాలు కేటాయించాలని చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో పార్కు, మోడల్ మార్కెట్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలన్నారు. అలాగే కోర్టు కేసులలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కొద్దు

- డీసీపీ రాజమహేంద్రనాయక్
- కార్డెన్ సెర్చ్‌లో 34 వాహనాలు సీజ్



మాట్లాడుతున్న డీసీపీ, పక్కన ఏసీపీ, సీఐలు

జనగామ: మారుమూల పల్లె వరకు వెళ్లిన టెక్నాలజీతో ఎంత ఉపయోగం ఉందో.. అంతే స్థాయిలో మోసాలు పెరిగి పోతున్నాయి.. ఎవరూ సైబర్ వలలో చిక్కొద్దని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. జిల్లా కేంద్రం అంబేడ్కర్‌నగర్‌లో సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం కాలనీ ప్రజలను ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ సైబర్ మోసగాళ్లు ఫోన్లకు ఫేక్ బ్యాంకుల పేరిట పంపించే లింకులను ఓపెన్ చేయొద్దని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అనధికార లోన్ యాప్‌ల ద్వారా రుణాలు పొందితే మోసం జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయించడం, తాగడం రెండూ నేరమేనని, ఇందుకు సంబంధించి అనుమానం కలిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 100 నంబర్‌కు డయల్ చేయవచ్చని పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని చెప్పారు. కార్డెన్ సెర్చ్‌లో ఆర్టీ నిబంధనలకు విరుద్ధంగా సరైన పత్రాలు లేని 31 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. కార్డెన్ సెర్చ్‌లో ఏసీపీ పార్థసారధి, నర్మెట్ట సీఐ సాయిరమణ, ఐదుగురు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని పాడిరైతుల ధర్నా

- స్టేషన్‌ఘన్‌పూర్‌లో స్తంభించిన ట్రాఫిక్



రాస్తారోకో చేస్తున్న పాడిరైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు శుక్రవారం ఘన్‌పూర్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల పరిధి గ్రామాల సొసైటీ అధ్యక్షులు, పాడి రైతులు పాల డబ్బాలతో రోడ్డెక్కి విజయ డెయిరీ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా క్రిష్టాజీగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు సాదం రమేష్ మాట్లాడుతూ.. మూడు మండలాలకు చెందిన పలువురు పాడిరైతులు విజయ పాలశీతలీకరణ కేంద్రాలకు ఏళ్ల తరబడి పాలు పోస్తున్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి పదిహేను రోజులకు ఒకసారి బిల్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రస్తుతం ఐదు విడతల(రెండున్నర నెలల) బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ పశువులకు దాణాతో పాటు డెయిరీ ఫామ్ నిర్వహణకు అధికంగా ఖర్చవుతోందని, అప్పులు చేస్తున్న రైతులు వాటిని చెల్లించడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వస్తున్నదని అన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాతో రహదారికి ఇరువైపులా కిలోమీటరు మేర అరగంట పాటు వాహనాలు స్తంభించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానిక పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో వివిధ సొసైటీల అధ్యక్షులు, పాడిరైతులు గుర్రపు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, వడ్లూరి వెంకటాద్రి, రవి, మునిగెల వెంకన్న, నక్క ప్రశాంత్, గోనెల నాగరాజు, ఈర్ల రాజయ్య, పదిర లక్ష్మారెడ్డి, వాసుదేవరెడ్డి, కోల వెంకటేష్, అట్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండం గట్టెక్కలే..!

ఆన్‌లైన్ ఆటంకాలు దాటని 'రైతురుణమాఫీ'

- 'డేటా నాట్ ఫౌండ్' లిస్టులో పలువురు..
- 'మూడో విడత'కు దూరంగా 39 సంఘాల్లోని 715 మంది సభ్యులు
- ఇంకా రుణమాఫీకి నోచుకోని మొదటి, రెండో విడత..
- వెయిటింగ్‌లో 20,123 మంది అర్హులైన అన్నదాతలు
- ఆన్‌లైన్ లోపాలను కారణంగా చూపుతున్న అధికారులు..

సాక్షిప్రతినిధి, వరంగల్ :

- హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచరకు చెందిన గాలి నాగరాజు 2021లో రూ.1.36 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నాడు. ప్రతీ సంవత్సరం వడ్డీ క్రమం తప్పకుండా కడుతున్నాడు. రుణమాఫీకి ప్రభుత్వం రేషన్‌కార్డు ప్రామాణికం కాదని చెబుతున్నా.. ఆన్‌లైన్‌లో వివరాలు సరిగా లేవనే కారణంతో ఆయనకు రుణమాఫీ చేయలేదు.
- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ఇప్పగూడానికి చెందిన పిట్టల రాజేందర్ అనే రైతుకు తనకున్న 2.10 ఎకరాల భూమిపై రూ.1.10 లక్షల రుణం ఉంది. నిబంధనల ప్రకారం రాజేందర్ అర్హుడైనా ప్రభుత్వం అందిస్తున్న రుణ మాఫీ మొదటి, రెండో జాబితాలో అతని పేరు రాలేదు. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారులను అడగగా సాంకేతిక సమస్య అని చెబుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకానికి అర్హులైన పలువురు రైతులు దూరంగా ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదటి, రెండో విడతల్లో 2,08,077 మంది రైతులకు రూ.1,506.50 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా.. ఇంకా సుమారు 20,123 మంది రైతులకు చెందిన ఖాతాల్లో రూ.152 కోట్ల వరకు జమకాలేదు. ఇందులో చాలా మంది రైతులకు రుణమాఫీ అయినట్లు ప్రభుత్వం నుంచి మెసేజ్ (ఎస్ఎంఎస్) వచ్చినప్పటికీ రుణమాఫీ కాలేదు. మూడో విడతలోనూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు సహకార సంఘాల పరిధిలో చోటుచేసుకున్న పొరపాట్లు రైతులకు శాపంగా మారనున్నాయి.

ఓ వైపు సాంకేతిక కారణాలు.. మరోవైపు కార్యదర్శుల నిర్లక్ష్యం..

మొదటి, రెండు విడతల్లో సాంకేతిక కారణాలు రైతుల రుణమాఫీకి అడ్డంకిగా మారగా, మూడో విడతకు రుణాల వివరాలు సకాలంలో ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి నివేదించడంలో పలువురు కార్యదర్శుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 95 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లు ఉండగా.. 39 సహకార సంఘాల్లో రూ.లక్ష లోపు నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొందిన 715 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ కాలేదు. ఒక్క జనగామలోనే 300కు పైగా ఉన్నారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2024 డిసెంబర్ 9వ తేదీ లోపు రుణాలు పొందిన వారికి రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. కానీ కొందరు కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల పలు సహకార సంఘాల్లోని 715 మంది రైతుల రుణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. అర్హులైన తమకు రుణమాఫీ ఎందుకు కావడం లేదని సహకార సంఘాల చుట్టూ తిరిగి నిలదీయడంతో ఈ విషయం వెల్లడైంది. దీంతో హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో సహకార శాఖ అధికారులు ఆరా తీశారు. రుణాలు తీసుకున్న సుమారు 715 మంది రైతులలో కొందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, మరికొందరివి ఆలస్యంగా ఆన్‌లైన్ అయ్యాయని.. అందువల్లే రుణమాఫీ కాలేదని తేల్చారు.



రేషన్‌కార్డు లేదని రుణమాఫీ చేయలేదు



ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇస్తామంటే నమ్మి తల్లిదండ్రుల రేషన్‌కార్డులో ఉన్న నా పేరును తొలగించుకున్నాను. రుణమాఫీకి ప్రభుత్వం రేషన్ కార్డు ప్రామాణికం కాదని చెప్పినా.. అధికారులు ఉండాలని చెప్పడంతో నాకు రుణమాఫీ కాలేదు. రూ.1.36 లక్షల క్రాప్ లోన్ అలాగే ఉంది. ప్రభుత్వం రేషన్‌కార్డు లేని నాలాంటి వారందరికీ రుణమాఫీ చేయాలని కోరుతున్న.

- గాలి నాగరాజు, రైతు, పీచర, వేలేరు మండలం

సాంకేతిక కారణాలు చెబుతున్నారు..



నాకు నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే స్థానిక సహకార బ్యాంకులో రూ.81,000 పంట రుణం తీసుకు న్నా. రెండో విడత పంట రుణమాఫీ నాటికి రూ.1.31లక్షల అప్పు ఉన్నప్పటికీ రుణమాఫీ జాబితాలో రాలేదు. ఈ విషయమై వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే సిస్టంలో 'నాట్ డేటా ఫౌండ్' అని చూపిస్తున్నదన్నారు. బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే అప్పు ఉన్న ప్రతీ రైతు సమాచారాన్ని నిబంధనల మేరకు పంపించామని.. ఎవరికైనా రాకుంటే ఆధార్, పట్టా పాస్‌బుక్, బ్యాంక్ బుక్ ఇస్తే ఎడిట్ ఆప్షన్ రాగానే రుణమాఫీ వర్తించేలా చూస్తామని చెబుతున్నారు.

- లోడంగి యాదగిరి, రైతు, దేవరుప్పుల

క్లుప్తంగా

రేపు సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు ప్రవేశపరీక్ష

విద్యారణ్యపురి : ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రేపు (ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కె.జగన్‌మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను సంబంధిత వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ //టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్‌లో ఉన్నాయని డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రవేశ పరీక్ష అనంతరం మెరిట్ ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారని ఆయన పేర్కొన్నారు.

'అనుమతిలేని కళాశాలల్లో ప్రవేశాలు పొందొద్దు'

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అనుమతిలేని కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందవద్దని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ ప్రవేశాలు పొందిన విద్యార్థులు సదరు కళాశాలకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఉందా లేదా అని పరిశీలించుకోవాలన్నారు. కొన్ని కళాశాలలు పేరు, అడ్రస్, మేనేజ్ మెంట్‌ను మార్చుకొని యూనివర్సిటీ అనుబంధంఉందని నమ్మించి ప్రవేశాలు చేపడుతున్నట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. అలాంటి కళాశాలల్లో చేరే విద్యార్థులకు విశ్వవిద్యాలయానికి ఎలాంటి సంబంధం ఉండదని గమనించాలన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి అనుమతితోనే పేరు, అడ్రస్, మేనేజ్‌మెంటు మారిన కళాశాలలకు మాత్రమే విశ్వవిద్యాలయం గుర్తింపును ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

శిశువును విక్రయించిన తండ్రిపై కేసు

- కొనుగోలుదారుడిపై కూడా..

ఏటూరునాగారం : శిశువును విక్రయించినందుకు తండ్రిపై.. కొనుగోలు చేసిన సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏటూరునాగారం ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన జంపయ్య, తన భార్య లక్ష్మిని ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వచ్చి ప్రసవం చేయించాడు. అయితే అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్న ఆ దంపతులకు జూన్ 2వ తేదీన మరో ఆడశిశువు జన్మించింది. కాగా అప్పటికే పథకం వేసిన జంపయ్య వారం రోజుల తర్వాత రహస్యంగా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన వేల్పుల సుధాకర్‌కు రూ.15 వేల నగదు, పాత ద్విచక్ర వాహనం తీసుకొని విక్రయించాడు. దీంతో కొనుగోలు చేసిన సుధాకర్, జంపయ్యలపై ప్రొటెక్షన్ చిల్డ్రన్ యాక్ట్ 2015 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం పాపను ఐసీడీఎస్ ములుగు ప్రాజెక్ట్ వారికి సంరక్షణ నిమిత్తం అప్పగించామని ఎస్సై తెలిపారు. పుట్టిన ఐదు రోజులకే పసిపాపను కన్న తండ్రే, తల్లికి తెలియకుండా విక్రయించిన విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు బాధ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వివరించారు.



పార్కింగ్.. పరేషాన్



వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడు



గిరాకీ లేక ఖాళీగా కూర్చున్న వ్యాపారులు

బారికేడ్ల ఏర్పాటుతో వాహనాలకు నో ఎంట్రీ

- వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ఉదయం పూట ఆటోలకు అనుమతి ఇవ్వాలి

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో కనీస వసతులు లేవు.. మార్కెట్ నిర్మాణ సమయంలో రూపొందించిన ప్లాన్‌లో చుట్టూ కమీషన్ దుకాణాలు, మధ్యలో కవర్ షెడ్ (చిరు వ్యాపారులకు), ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్ ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదించారు. కానీ కూరగాయల మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. రాజకీయ నాయకులు, మార్కెట్ కమిటీ నాయకుల అతి జోక్యం, అధికారుల ఉదాసీనతతో పాత మార్కెట్‌లో తక్కువగా ఉన్న చిల్లర వ్యాపారులు పుట్టుగొడుగుల్లా పుట్టుకు వచ్చారు. దీంతో ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేయకుండా మినీ హోల్‌సేల్, చిల్లర వ్యాపారులకు ప్లాట్లు కేటాయించారు. మార్కెట్‌లో వ్యాపారులు సుమారు 10–12ఫీట్ల వరకు దుకాణాలు పెట్టడంతో వాహనాలకు, వినియోగదారుల రాక పోకలకు ఇబ్బందిగా మారింది. పార్కింగ్ లేకపోవడం వల్ల కూరగాయలు తెచ్చిన వాహనాలు, కొనుగోలు చేసేందుకు వస్తున్న వినియోగదారులు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌లు చేయడాన్ని ఇటీవల మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ పర్యవేక్షించి వాహనాలు లోపలకు రాకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అప్పటి నుంచి వాహనాలు లోపలకు రాకుండా మార్కెట్‌కు ఉన్న ఐదు గేట్ల ముందు బారికేడ్లను ఏర్పాటు చేశఋరు. అదనంగా సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయడంతో వాహనాల పార్కింగ్ ఇబ్బందిగా మారింది. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన నగర వాసులు వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొంది. అధికారులు వెంటనే స్పందించి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉదయం సడలింపు ఇవ్వాలి..

చిరువ్యాపారులు కూరగాయలు కొనుగోళ్ల కోసం వస్తున్న సమయంలో వాహనాలు లోపలకు రాకుండా గేట్ల ముందు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఇబ్బందిగా మారిందని హోల్‌సేల్ వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు జోరుగా వ్యాపారం సాగుతుందని అదే సమయంలో ఆటోలను లోపలకి వచ్చేందుకు అనుమతించాలని వ్యాపారులు కోరుతున్నారు.

వ్యాపారానికి అవరోధం..

కూరగాయల మార్కెట్ చుట్టూ ఉన్న గేట్ల ఎదుట బారికేడ్లు, వాహనాలు అడ్డంగా పెట్టడంతో లోపల వ్యాపారం లేకుండా పోతోందని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో లోపలే కూరగాయలు విక్రయించాలని నిబంధన పెట్టిన అధికారులు బయట విచ్చలవిడిగా విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. లోపలకు వాహనాలను అనుమతించకపోవడం వల్ల బయట విక్రయిస్తున్న వారి వద్దే కూరగాయలు కొనుగోలు చేస్తూ వినియోగదారులు అటునుంచి అటే వెళ్లి పోతున్నారని వ్యాపారులు తెలిపారు. ఇప్పటికైనా బయట అమ్మకాలను నిరోధించాలని చిరువ్యాపారులు డిమాండ్ చేశారు.

గిరాకీ లేదు..



గేటుకు అడ్డంగా వాహనాలు పెట్టి లోపలకు రానివ్వపోవడంతో గిరాకీ పడిపోయింది. బయటనే కొంటూ అటే వెళ్లిపోతున్నారు. బయట వారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. తాము మాత్రం అద్దెలు కడుతూ కష్టాలు పడుతున్నాం.

- బొల్లం రాజు, కొత్తిమీర వ్యాపారి

బయట విక్రయాలను నియంత్రించాలి



మార్కెట్ బయట ఇష్టానుసారంగా కూరగాయలు అమ్ముతున్న వారితో లోపల ఉన్న వ్యాపారులు నష్టపోతున్నారు. బహిరంగంగా అమ్మకాలను కట్టడి చేయాలి. లోపలకు ఉదయం వేళల్లో ఆటోలు, రిక్షాలకు అనుమతి ఇవ్వాలి.

- జారతి శ్రీనివాస్, కమీషన్ వ్యాపారి

రైతుల సంక్షేమానికి సీడ్స్ కార్పొరేషన్ కృషి

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

మడికొండ : రైతుల సంక్షేమానికి సీడ్స్ కార్పొరేషన్ కృషి చేస్తోందని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మడికొండలోని తెలంగాణ సీడ్స్ కార్యాలయంలోని గోడౌన్లను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో అన్వేష్‌రెడ్డి మాట్లాడారు. సంస్థ నుంచి రైతులకు చెల్లించే నగదును ఇక నుంచి ఆలస్యం లేకుండా చూస్తానన్నారు. ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం పనిచేస్తాయని, కానీ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ రైతుల సంక్షేమానికి పని చేస్తోందన్నారు. సీజన్‌ను బట్టి విత్తనాలు అదే సీజన్‌లోనే తయారు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. మార్కెట్‌లో ఉన్న ధరకంటే తక్కువ ధరకు విత్తనాలను అందిస్తామన్నారు. సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలు ఇతర రైతులు సైతం కొనుగోలు చేసే విధంగా చూడాలని, సమష్టిగా కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ వినయ్, సీడ్స్ వరంగల్ జిల్లా రీజనల్ మేనేజర్ బయ్య రఘు, నర్సంపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, జనగామ జిల్లా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, పల్లెపాటి రతన్, ప్రభాకర్‌గౌడ్, రంగు రంజిత్ కుమార్, అనిల్, రైతులు పాల్గొన్నారు.

'పొలం బాట'తో సత్ఫలితాలు

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ : రైతుల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న పొలం బాట కార్యక్రమం సత్ఫలితాలిస్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం హనుమకొండ సర్కిల్ ఎస్ఈ, ఆపరేషన్, ఎంఆర్‌టీ, డీఈలు, ఏడీఈలు, తదితర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ విధిగా చేపట్టడం ద్వారా అంతరాయం, బ్రేక్ డౌన్స్ చాలా వరకు తగ్గుతాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్‌లు పెంచాలని, ఓవర్‌లోడ్ భారం పడకుండా లాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు ఆపరేట్ అయ్యేలా చూడాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌ల రిలీజ్ వేగవంతం చేయాలని, కెపాసిటర్ బ్యాంకులు అమర్చుకోవడం ద్వారా కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి అధికారి, ఉద్యోగి నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీజీఎంలు కె.కిషన్, రవీంద్రనాథ్, అశోక్, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- బెయిల్ డబ్బుల కోసం చైన్ స్నాచింగ్
- వివరాలు వెల్లడించిన డీసీపీ షేక్ సలీమా



నిందితుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ షేక్ సలీమా, పక్కన ఎస్సై, పోలీసులు

రామన్నపేట : గంజాయి కేసులో పట్టుబడి.. బెయిల్ కోసం నగదు చెల్లించేందుకు మళ్లీ చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అంతర్ రాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పేర్కొన్నారు. శుక్రవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నందిరాం నాయక్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం వరంగల్ కొత్తవాడలోని మడేలయ్య గుడి ప్రాంతంలో ఓ మహిళ మెడలో నుంచి నిందితులు బైక్‌పై వచ్చి మెడలోని పుస్తెలతాడు (2 తులాలు) లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. కాగా సాంకేతిక పరిజ్ఞానం, స్థానికుల సమాచారంతో నిందితులను ములుగు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో భూపాలపల్లికి చెందిన బొలా అనిల్, మహ్మద్ బాసిత్, మహ్మద్ షారుఖ్ ఖాన్, మహ్మద్ షోయబ్ ఖాన్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.1.50 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి , వైజాగ్ పోలీస్ స్టేషన్‌లలో గతంలో వీరిపై గంజాయి కేసులు, పరకాల పోలీస్ స్టేషన్‌లో చైన్ స్నాచింగ్ కేసు, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితులు భూపాలపల్లిలో గంజాయి కేసులో అరెస్టు అయి విడుదల కాగా, బెయిల్ డబ్బుల కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా నిందితులకు ఆశ్రయం కల్పించిన ఎల్‌బీ కళాశాల విద్యార్థిని సైతం అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, భూపాలపల్లి ఇన్‌స్పెక్టర్ నరేష్, మట్టెవాడ ఎస్సై విఠల్, క్రైం పార్టీ పోలీస్ సిబ్బందిని డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

'ఆదివాసీ' పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



మాట్లాడుతున్న పి.మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 50 శాతం ఆదివాసీ ప్రాంతాలున్నాయని విద్యార్థులు వాటి పరిశోధనలపై దృష్టి సారించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సంపన్నమైది ఆదివాసీ సంస్కృతి అని అన్నారు. ములుగు జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. భీక్షపతి రావు మాట్లాడుతూ ఆదివాసీలు ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యావంతులైన ఆదివాసీలు తమతమ ప్రాంతాల్లో అవగాహన కల్పించి చైతన్య పర్చాలన్నారు. కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ఈసం నారాయణ మాట్లాడుతూ 90 దేశాల్లో ఆదివాసీలున్నారని చెప్పారు. అటవీ సందపకు వారే రక్షకులు అన్నారు. విశ్రాంత అధ్యాపకుడు ఈసం సారయ్య దొర మాట్లాడుతూ.. ఆదివాసీ గోత్ర వ్యవస్థ, మూలాలను మరువొద్దన్నారు. అలాగే కేయూ మొదటి గేట్ నుంచి ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు డప్పుచప్పుల మధ్య నృత్యాలతో ర్యాలీగా వచ్చారు. తొలుత ఆదివాసీ పతాక ఆవిష్కరణ చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గుర్రంబాబా గ్యాంగ్ ఆటకట్టు



గుర్రంబాబా ముఠా అరెస్ట్‌ను చూపుతున్న ఎస్సై

నర్సింహులపేట : దేశ గురువునంటూ మూఢనమ్మకాలపై ప్రచారం చేస్తూ పేదలను మోసం చేస్తున్న గుర్రంబాబా గ్యాంగ్‌ను మండలంలోని పడమటిగూడెం శివారులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన పర్వతం లక్ష్మయ్య (గుర్రంబాబా), మోతే రాములు, కడమంచి సైదులు, కడమంచి అశోక్, సిరిగిరి నరేష్, తూర్పాటి గంగరాజు (ఆరుగురు) ఒక గుర్రంను కొనుగోలు చేసి ముఠాగా ఏర్పడి దేశగురువు అవతారం ఎత్తారు. వివిధ గ్రామాల్లో ఆదివారం, గురువారం రోజుల్లో పర్యటిస్తూ మూఢ నమ్మకాలను ప్రచారం చేస్తుంటారు. దీంతో నిజమని నమ్మిన వారినుంచి అందిన కాడికి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. మీకు అశుభం జరగబోతుంది.. మీ ఇంట్లో దయ్యాలు ఉన్నాయని.. చేతబడి చేశారని మాయమాటలు చెబుతూ భయభ్రాంతులకు గురి చేసి.. శాంతి పూజలు చేయాలని పేదల నుంచి డబ్బులు స్వాహా చేసి నిమ్మకాయలు, తాయత్తులు ఇస్తున్న ముఠాను మండలంలోని పడమటిగూడెం శివారులో అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. జయపురం శివారు తండాల నుంచి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. టాటా ట్రాలీతో పాటు రూ.9 వేల నగదు, తాయత్తులు, రుద్రాక్ష దండలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గుర్రంను సేఫ్ కస్టడీకి పంపించామని అన్నారు.

బ్యాంక్ లింక్ పంపి.. రూ.11లక్షలు దోచేశారు

- ఖాతాలో రూ.142 మిగిల్చిన సైబర్ నేరగాళ్లు
- సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసిన బాధితుడు

జనగామ : ఇంటి నిర్మాణానికి మూడేళ్లుగా బ్యాంకులో పొదుపు చేసుకుంటున్న సొమ్మును సైబర్ మాయగాళ్లు ఏపీకే లింక్ పంపి దాన్ని డౌన్‌లోడ్ చేయగానే క్షణాల్లో నగదును మాయం చేశారు. ఫోన్ ఔట్ గోయింగ్ పని చేయడం లేదని.. అనుమానం వచ్చి బ్యాంకు వెళ్లి ఆరా తీయగా ఖాతాలో సొమ్ము లేదని చెప్పడంతో ఖంగుతిన్నాడు సదరు ఖాతాదారుడు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ పట్టణం హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన పోలోజు రామేశ్వర్ ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్నాడు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు మూడేళ్ల క్రితం పునాది వేశాడు. అప్పటి నుంచి ఇంటి నిర్మాణానికి సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేస్తూ స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.11లక్షల వరకు జమ చేశాడు. ఇంటి నిర్మాణ పనులకు అవసరమైనప్పుడు బ్యాంకు నుంచి కొంత నగదును డ్రా చేసుకుంటున్నాడు. కాగా ఈ నెల 8వ తేదీన వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లిన రామేశ్వర్.. తిరుగు ప్రయాణంలో తన ఫోన్‌కు యూనియన్ బ్యాంకుకు సంబంధించిన ఏపీకే యాప్ లింక్‌తో ఫేక్ మెసేజ్ వచ్చింది. బ్యాంకు ఖాతా సేఫ్టీ కోసం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సైబర్ మోసగాడు పంపించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. సైబర్ నేరస్తుడు సదరు వ్యక్తికి ఎటువంటి అనుమానం కలుగకుండా తన ఫోన్ ఔట్ గోయింగ్ కాల్ వెళ్లకుండా చేశాడు. అదే రోజు రాత్రి రామేశ్వర్ యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.7 లక్షలు, శుక్రవారం రూ.4.21 లక్షలు, మొత్తంగా 16 లావాదేవీల ద్వారా రూ.11.21 లక్షల నగదును డ్రా చేసుకుని, రూ.142 మాత్రమే మిగిల్చారు. ఫోన్ కలవడం లేదని అనుమానం వచ్చిన బాధితుడు రిపేరు సెంటర్‌కు వెళ్లి సరి చేయగా, డబ్బులు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో అక్కడ నుంచి హుటాహుటిన బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు అధికారులు ఖాతా నంబర్‌ను పరిశీలించిన తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా అయినట్లు తెలిపారు. ఇందులో రూ.9.21 లక్షల నగదు అనుమానం కలుగకుండా డ్రా చేయగా, రూ.2లక్షలు మాత్రం చెన్నైలోని సిద్దపుదూర్ సెంట్రల్ బ్యాంకు నుంచి రాహుల్ అనే వ్యక్తికి నెఫ్ట్ చేసినట్లు గుర్తించినట్లు బాధితుడు రామేశ్వర్ తెలిపారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా 1930కు ఫోన్ చేసి సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయించారు. వెంటనే కేసును విచారించిన పోలీసులు, రూ.1.37 లక్షలను హోల్డ్ చేసినట్లు మెసేజ్ వచ్చినట్లు రామేశ్వర్ తెలిపారు. పోలీసులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

నివారణ మందుతో.. ఎండిన మిర్చినారు

- న్యాయం చేయాలని రైతుల డిమాండ్



ఎండిపోయిన మిర్చినారును చూపుతున్న రైతులు

కేసముద్రం : కొండనాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిందనట్లు.. మిర్చినారుకు వేరుకుళ్లు తెగులు సోకకుండా పురుగు మందును పిచికారీ చేస్తే కొద్ది రోజుల్లోనే నారు మొత్తం ఎండిపోయింది. మండలంలోని ధన్నసరి గ్రామంతోపాటు శివారు తండాలకు చెందిన 20మంది రైతులు సాగు చేస్తున్న మిర్చినారుకు వేరుకుళ్ల తెగులు సోకింది. వీటి నివారించేందుకు ఓ ఎరువుల దుకాణంలో పురుగుల మందును 10రోజుల క్రితం కొనుగోలు చేశారు. మరుసటి రోజు మిర్చినారుపై మందును పిచికారీ చేయగా, మూడు నుంచి ఐదురోజుల్లో మిర్చినారు ఎండిపోయిందని బాధిత రైతులు ఆరోపించారు. దీంతో ఒక్కో రైతుకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోవాల్సి వచ్చిందని, వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఓ వెంకన్న ఇప్పటికే ఎండిపోయిన మిర్చినారును పరిశీలించారు. తెగుళ్ల నివారణ మందు శాంపిల్స్ తీసుకుని, ఓల్డ్ మలక్‌పేట్ హైదరాబాద్‌లోని పురుగుల, తెగుళ్ల మందుల ప్రయోగశాలలకు పంపించినట్లు ఆయన తెలిపారు.



REAL ESTATE

PLOT FOR SALE

- మామునూర్‌లో పుడా లేఅవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి & జ్యోతిభాపులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా దాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263 అమ్మకానికి. 9032111600. [W-1242430]

LAND FOR SALE

- 1.65 acres of Land on Sale at Neppalli, A.P. 2 KM from Davuluru toll, 600 m from NH-65, 4KM from Kankipadu ✆ 83099 87010 [B-773801]

SERVICES

- వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

BUSINESS OFFER

- ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీ+కమీ॥. ఫోన్: 7988242391 [H-778959]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

WANTED

- Aptivine Vertex Consultanting Private Limited: Wanted a Receptionists - 4, Verification Executives-4. Qlf: Inter or Degree. Cell: 9533680353, Warangal. [W-1239762]
- కాంట్రాక్టర్ వద్ద రైల్వే & పెట్రోల్‌పంపు నందు సివిల్ వర్క్స్ చేయుటకు ఇంజనీర్ & సూపర్‌వైజర్ కావలెను. అ: సివిల్ ఇంజనీర్ -B.Tech(Civil), సూపర్‌వైజర్-ITI, Diploma, Degree. Work Place: TG & AP. 9989606333, 9491474143. [W-1239831]
- కాకతీయ యూనివర్శిటి, వరంగల్ క్యాంపస్ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అభ్యర్థులు S.S.C. Pass, ఎత్తు: 5.6, జీతం: 11,100/, 8 Hours డ్యూటీ, E.P.F., ESI ఇవ్వబడును. సంప్ర॥ 9848367179, 9848481409. [M-1167644]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి +భోజనం. జీతం. 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఆస్పత్రికి తరలిస్తుండగా వృద్ధురాలి మృతి



లారీ ఢీకొట్టి నుజ్జునుజ్జయిన వాహనం

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబట్‌పల్లికి చెందిన వృద్ధురాలు దగ్గు శాంతమ్మ(62) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అంబట్‌పల్లికి చెందిన దగ్గు వెంకటేశ్వరావుతో కలిసి అతడి భార్య సంగీత, తల్లి శాంతమ్మ భూపాలపల్లి ఆస్పత్రి నుంచి తిరిగి గ్రామానికి టవేరా వాహనంలో వస్తున్నారు. మహదేవపూర్ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోకి రాగానే కారు ముందు టైర్ పగిలిపోయి అదుపుతప్పి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టగా, టవేరా ముందు భాగం నుజ్జునుజ్జయింది. దీంతో వెనక సీటులో కూర్చున్నశాంతమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, ఇటీవల మృతురాలి కాలు విరగడంతో ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై శాంతమ్మ పెద్ద కుమారుడు రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూతురుతో కలిసి యువ జర్నలిస్ట్ బలవన్మరణం



తండ్రీకూతుళ్లు యుగంధర్‌రెడ్డి, ఆద్య (ఫైల్)

వరంగల్ క్రైం: ఓ యువ జర్నలిస్టు తన కూతురుతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన గట్టిగొప్పుల యుగంధర్‌రెడ్డి అలియాస్ యోగి (36) పలు ఎలక్ట్రానిక్ మీడియాల్లో రిపోర్టర్‌గా పనిచేశాడు. హనుమకొండ నక్కలగుట్టలోని అద్దె ఇంట్లో ఉంటున్నారు. అతనికి తల్లి కృష్ణవేణి, భార్య స్వప్న, కూతురు ఆద్య(10) ఉన్నారు. కూతురు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. సాయంత్రం పాఠశాల ముగిశాక కూతురును తీసుకుని ఏకశిలా పార్క్ సమీపంలోని తన కార్యాలయానికి వెళ్లాడు. ఏమైందో తెలియదు కానీ, కూతురు ఆద్య(10)ను ఫ్యాన్‌కు చీరతో ఉరేసి, తనూ ఫ్యాన్ కొక్కానికి ఉరేసుకున్నాడు. వ్యక్తిగత పనిపై ఓ ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్.. యోగి కార్యాలయానికి వెళ్లగా తలుపులు వేసి ఉన్నాయి. ఫోన్ చేయగా ఎంతకూ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి మిగతా జర్నలిస్టులకు సమాచారం ఇచ్చారు. అందరూ కలిసి వెళ్లి బలవంతంగా తలుపులు తెరవగా తండ్రి,కూతురు వేలాడుతూ కనిపించారు. వెంటనే కిందికి దింపి చూడగా యోగి అప్పటికే చనిపోయాడు. ఆద్యకు పల్స్ ఉండడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు నిర్ధారించారు మృతదేహాలను సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా, యోగి.. కూతురుతో కలిసి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరావడం లేదు.

కొమ్ము వేషధారణలో కలెక్టర్ దివాకర టీఎస్, పీఓ చిత్రమిశ్రా



సంప్రదాయ వేషధారణలో ప్రదర్శనలో పాల్గొన్న ఆదివాసీలు



ఆదివాసీ సంప్రదాయం.. ప్రత్యేకం

ములుగు జిల్లా ఏటూరునాగారంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీలు డోలు వాయిస్తూ కొమ్ము బూర, సంప్రదాయ వేషధారణలతో ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ దివాకర టీఎస్, ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- ఏటూరునాగారం